స్కెచ్ :

# ★ నిర్భాగ్యులు ★

రచన : శ్రీ యం. సత్యనారాయణ

రాజు నడుస్తున్నవాడల్లా ఆగిపోయాడు. అతనిదృష్టి ఆ వ్యక్తిపై బడింది. ఆ వ్యక్తి చేతిలోని పదిరూపాయల నోటు ఎలక్ట్రిక్ లైటు కాంతిలో చిరుగాలికి రెపరెపలాడు చున్నది. అతడు సగర్వముగా ఆ నోటు వంక, మెర్క్యూరీ లైట్ల కాంతిలో కొట్టవచ్చినట్లగు పడుచున్న "డెక్కన్ బార్ అండ్ కేఫ్" వంక చూసి, దానిని సమీపింప బయల్దేరాడు.

రాజు ఆలోచనలో పడ్డాడు. ఆ వ్యక్తి తను ఉదయం చూసినవాడే. సందేహము లేదు. ఏమిటి ? వీడు పొద్దస్తమానం కష్టపడి సంపాదించినది యిలా తగలేస్తాడా? ఈ రోజు అదృష్టం బాగుండటం వల్ల ఎవరో ఒక అమ్మాయి కారు క్రింద పడబోతుంటే రక్షించినందుకు ఆ అమ్మాయి తండ్రి కృతజ్ఞతగా యిచ్చిన పదిరూపాయల నోటది. అప్పుడతని సంతోషానికి మేర లేకపోయింది. ఏనాడు కళ్ల చూడని నోటు ఈనాడు చూసేటప్పటికి పొందిన ఆనందం అనుకొన్నాడుతను. అతని సంతృప్తి చూచి, భార్యా బిడ్డలకు ఏదైనా కొని పట్టుకు వెళ్లవచ్చని సంబర పడుతున్నాడని అనుకున్నాడుతను. ఈనాడన్నా కడుపారా భుజిస్తారనుకొన్నాడు తను అదే పదిరూపాయల నోటు భాగ్యశీలురకు వస్తే, యింతేనా? అని నిట్టూరుస్తారు. కాని మా వంటివారికి వస్తే ఏ విధంగా, మహాప్రసాదమని కళ్ల కద్దుకుని తీసుకుంటారో చూడమన్నట్లు, తీసుకొన్నాడతడు. అంత గర్వంగా తీసుకొంది యిందుకేనా ?

ఆ వ్యక్తి బార్‌లోనికి వెళ్ళి, ఒక బుడ్డి తెచ్చుకుని, లైటు స్తంభం దగ్గరకి వెళ్ళి త్రాగడం మొదలు పెట్టాడు.

రాజు అలానే నిలుచుని అతని వైఖరిని తిలకిస్తున్నాడు. అతని ఆనందమంతా యిందుకే అని అప్పుడు ఊహించలేకపోయాడు తను. తనేమిటి మరెవ్వరూ ఊహించలేరు. ప్రతి రోజూ యిదే విధంగా చేస్తూ వుంటాడా ? బాగా అలవాటు పడి వుంటాడు. లేకపోతే గడగడ ఎలా త్రాగగలుగుతాడు ? పాపం ! యిక ఆ మధువు బారినుండి తప్పించుకోగలడా ? ఒక్క నిముషంలో పదిరూపాయలూ కరిగిపోయాయి. ఒక్కక్షణం ఉన్నా ఆలోచించాడా తన భార్యాబిడ్డల సంగతి ? వీని సంపాదనమీదే ఆధారపడివుంటే, వారెంత బాధపడుతుంటారో ! ఒకవేళ వీడికి భార్యా, పిల్లలుండరా ! ఒంటరిగాడా ?

అంతలో ఒక స్త్రీ రంగంలో ప్రవేశించినది. స్తంభానికి ఆనుకొనివున్న వ్యక్తిని, 'ఏమండి' అని పిలుస్తోంది. తల్లి మంచం మీద వుందనితెలుసుండీ ఏమిటండి యిది? డాక్టరు చెప్పిన మందు యివ్వకపోతే, యిక ఆమె బ్రతకదని తెలుసుండీ, ఏమిటండి యిది ! అక్కడ ఆమె చావుబ్రతుకుల మధ్య నలిగిపోతూందండి ! ఏమండి ! మిమ్మల్ని కలవరిస్తూందండి ! పిల్లలు ఆకలి ! ఆకలి అంటున్నారండి ! లేవండి ! పదండి ! ఇంట్లో పెనుతుపానులా వుందండి ! అని ఆమె ఆ వ్యక్తితో మొరపెట్టుకుంటుంది.

రాజు మనస్సు మరొక్కసారి చివుక్కుమన్నది. ఏమిటి? ఈవిడా యితని ఇల్లాలు! కన్నతల్లి మరణశయ్యపైనుంటే పుత్రుడు మధుదేవత తొడపై శయ్యనిస్తున్నాడా ? పిల్లలు 'ఆకలో ! అన్నమో !' అని అలమటిస్తుంటే, జనకుడు మధుదేవత అందిస్తున్న తాంబూలమును సేవిస్తున్నాడా? సతి కన్నీరు మున్నీరుగా విలపిస్తూ, ప్రాధేయపడుతుంటే, అకన్నీటినే మధువుగా గ్రోలుచున్నాడా ? హా ! పరమాత్మా ! ఏమిటీ జీవుల బ్రతుకు?

ఆమె భర్తను చెయ్యిపట్టుకొని లేపింది. తత్పర్యవసానం చెంప చెళ్లుమంది. తూగిపోతున్నాడతడు. చెరామడా కొడుతున్నాడు. ఎలాగైనా యింటికి తీసుకువెళ్లాలని విశ్వప్రయత్నం చేస్తోందా సాధ్వి !

రాజు యికఆగలేకపోయడు. ఆమెనాతని బారినుండి రక్షించాలని. సమీపింప నుద్యుక్తుడయ్యాడు.

కాని....

పోలీసు జీపొకటి రయ్ మంటూ వచ్చింది. క్షణంలో జీపు దూసుకుపోయింది. కెవ్వుమని కేక వినిపించింది.

ఆమె రక్తపు మడుగులో వుండటం చూశాడు రాజు. పెనుగులాటలో ఆమె జీపు క్రిందపడి వుంటుందని గ్రహించాడు. పోలీసు జీపు అయివుండీ, ఆపకుండ వెళ్ళిపోవటం చూచి ఆశ్చర్య చకితుడయ్యాడు. బహుశా తమ మీదకి కేసురాకుండా వుండటానికి అలా చేశాడు కాబోలు ఆ జీపులోని ఇనస్పెక్టర్. అదే మరెవ్వరైనాఐతే కేసు పాడా యినస్పెక్టర్ !

తల్లి, పిల్లలు ఏమైపోతే నాకేం అన్నట్లు ఆ వ్యక్తి వైఖరి, శాశ్వతంగా కనుమూసిన ఆ పవిత్ర మూర్తిని, చూసి ఒక నిట్టూర్పు విడిచాడు రాజు.

పాపం ! నిర్భాగ్యులు అనుకుంటూ యింటి ముఖం పట్టాడు

---

## మనవి

అనివార్య కారణాల వలన ఈ సంచికలో "నేనువిన్న ఆకాశవాణి కార్యక్రమాలను" సమర్పింపలేకపోయాము. అందుకు మా పాఠకులను మన్నించమని కోరుతున్నాము.